## పౌరసరఫరాల అధికారులకు డీలర్ల సన్మానం



శంషాబాద్‌: రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయం హైదరాబాద్‌ సంయుక్త కమిషనర్‌గా పదోన్నతిపై బదిలీ అయిన రంగారెడ్డి పౌరసరఫరాల అధికారి మనోహర్‌ కుమార్‌ రాథోడ్‌, కొత్తగా జిల్లా పౌరసరఫరాల అధికారిగా నియమితులైన గంప శ్రీనివాసులను రాజేంద్రనగర్‌ సర్కిల్‌ రేషన్‌ డీలర్లు గురువారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానం చేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్డుదారులకు సరైన సేవలందించి వారి మన్ననలు పొందాలని ఈ సందర్భంగా అధికారులు డీలర్లకు సూచించారు. సన్మానం చేసిన వారిలో రాజేంద్రనగర్‌ సర్కిల్‌ రేషన్‌ డీలర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌, శివకుమార్‌, జహీర్‌, వెంకటేష్‌ తదితరులున్నారు.

## ఉద్యాన కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం



ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో భారత హాకీ క్రీడాకారుడు మేజర్‌ ధ్యాన్‌ చంద్‌ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్‌ డీన్‌ ప్రశాంత్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు ఓటమికి కుంగిపోకూడదన్నారు. అదే విధంగా గెలుపు-ఓటములు సహజమని కష్టపడితే తప్పకుండా ఉన్నత స్థాయి చేరుకుంటారని తెలిపారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 5కే రన్‌ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు మెమెంటోలతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఓఎస్‌ఏ డాక్టర్‌ నాగ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు వీడ్కోలు



శంషాబాద్‌: పట్టణంలోని కొత్వాల్‌గూడ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీలైన ఉపాధ్యాయులు బాల్‌రాజ్‌, సుధానీరజ, లిల్లీ, రోజ్లిన్‌, చందన్‌రావు, లక్ష్మీ శ్రీనివాస్‌ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం వారికి శాలువాలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌ నాయక్‌, మాజీ మండల విద్యాధికారి రాంరెడ్డి, కౌన్సిలర్‌ లక్ష్మీశ్రీనివాస్‌, స్థానికులు రాజిరెడ్డి, నరసింగరావు, రఘునందన్‌గౌడ్‌, పీఆర్‌టీయూ నేతలు బాల్‌రెడ్డి, వెంకరమణ, వీరమల్లేష్‌, సురేందర్‌, ఈశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు రుణాలు



బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం నిరుద్యోగ యువతకు రుణాలు ఇస్తూ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ సంఘం చైర్మన్‌ బుర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌, చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో స్వయం ఉపాధి కోసం సత్యనారాయణచారి, వినోద్‌ల కుమారుడు శ్రీకాంత్‌చారి జై భవానీ వన్‌ క్లిక్‌ ఫోటో స్టూడియో డిజిటల్‌ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు ఇస్తూ, ఉద్యోగాలు రాని యువతకు స్వయం ఉపాధి కోసం ఆర్థికంగా రుణాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌ కుమార్‌, గోపాల్‌ ముదిరాజ్‌ సంపత్‌గౌడ్‌, ప్రవీణ్‌ ముదిరాజ్‌, శ్రీహరిచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ

రాజేంద్రనగర్‌: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని మధుబన్‌ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజను గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన విద్యార్థులు



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీకొండా లక్ష్మణ్‌ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థులు గురువారం ఏక్‌ పేడ్‌ మాకే నామ్‌ క్యాంపెయిన్‌లో భాగంగా విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. గతంలో నాటిన మొక్కల దగ్గర పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఇతరుల చేత నాటించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్‌ ప్రశాంత్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ కళాధర్‌బాబు, శ్రీనివాస్‌, జెన్ని, నాగ హర్షిత, తిరుపతయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

## జువైనల్‌ హోమ్‌కు ఇద్దరు మైనర్‌లు తరలింపు

రాజేంద్రనగర్‌: దొంగతనానికి పాల్పడిన ఇద్దరు మైనర్‌ బాలులను పోలీసులు అదుపులోకి తీసుకొని జువైనల్‌ హోమ్‌కు తరలించారు. డీసీపీ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ పరిధిలోని హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబం ఈ నెల 18న ఇంటికి తాళం వేసి నాగర్‌కర్నూల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రూ.2.40 లక్షల నగదు, 6 తులాల బంగారం, 16 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలాపూర్‌ ప్రాంతానికి చెందిన ఖాజాఅలీ (23) ఆటో డ్రైవర్‌, ఇతను మరో ఇద్దరూ మైనర్‌ బాలులతో కలిసి దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మైనర్‌లిద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం జువైనల్‌ హోమ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు ఖాజా అలీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఎలాంటి సొత్తును స్వాధీనం చేసుకోలేదని వెల్లడించారు.

## కొత్త నాలాకు భూమి తీసుకుని..

# పాత నాలా తెరిచిన వైనం

- రూ.9 కోట్ల నిధులను ఖర్చుచేసి బాక్స్‌ డ్రైన్‌ను నిర్మాణం
- అధికారులతో వాదనకు దిగిన యజమానులు
- ఉన్నతాధికారుల ఆదేశాలంటున్న అధికారులు



అధికారులు పునరుద్ధరిస్తున్న పాత నాలా



టౌన్‌ప్లానింగ్‌ అధికారితో వాదనకు దిగిన భూ యజమానులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, ట్రయల్స్‌ విల్లాల మధ్యలో ప్రైవేటు పట్టా భూమి ఉంది. అందులో నుంచి ఓపక్కగా మూడు అడుగుల వెడల్పుతో పందెన్‌ వాగు ప్రవహిస్తుండేది. అది సరిపోక నీరు పంచవటి కాలనీ, ట్రయల్స్‌ విల్లాలోకి వెళ్లటంతో పాటు రోడ్డుపై రాకపోకలను నిలిపివేసేది. దీంతో సమస్యను తీర్చాలని ఇటీవల మున్సిపాలిటీ నుంచి రూ.9 కోట్ల నిధులను ఖర్చుచేసి బాక్స్‌ డ్రైన్‌ను నిర్మించారు. దానికి మొదట భూ యజమానులు ఒప్పుకోకపోవటంతో స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నరేందర్‌రెడ్డి, అప్పటి కమిషనర్‌ ఫల్గుణ్‌కుమార్‌లు వారితో చర్చించి ఒప్పించారు. ఉచితంగా ఇచ్చిన భూమిలో నుంచి నాలుగు మీటర్ల వెడల్పుతో వంద మీటర్ల పొడవు వారి పట్టా భూమిలో నుంచి బాక్స్‌ డ్రైన్‌ను నిర్మించారు.అప్పట్లోనే పాత నాలాను పూడ్చి కాస్త యినా తమకు జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటామని తెలపటంతో అందరూ అంగీకరించారు. కొత్త బాక్స్‌ డ్రైన్‌ పనులు పూర్తి కావటంతో పాత నాలాను పూడ్చి చదును చేసుకున్నారు.

**నాలాను పూడ్చారని ఫిర్యాదు..**

పాత నాలా పక్కన ఉన్న ఓ రోడ్డుపై వచ్చే వర్షం నీరు దాని ద్వారా బయటకు వెళ్లేది. అది కాస్త పూడ్చివేయటంతో ఆ నీరంతా అక్కడే ఆగిపోతుంది. దీంతో ఆ రోడ్డులో ఉన్న ఓ వ్యక్తి మున్సిపల్‌ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేయగా, ఆయన వెంటనే పూడ్చిన నాలాను తెరవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గురువారం మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్‌ అధికారి సంతోష్‌సింగ్‌ నాలాను పునరుద్ధరించారు. దీంతో భూ యజమానులు తాము నాలుగు మీటర్ల వెడల్పుతో వంద మీటర్ల పొడవు భూమిని నాలా కొరకు ఇచ్చామని, పాత నాలాను తిరిగి తెరవాల్సిన అవసరం ఏమిటని అధికారితో వాదనకు దిగారు. పాత నాలాను పునరుద్ధరిస్తే కొత్త నాలాను తొలగిస్తామన్నారు.

> **ఆదేశాలను అమలు చేశాం**
>
> గతంలో ఉన్న నాలాను పూడ్చటంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నాలాను పునరుద్ధరించాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు ఆ పనులు చేపట్టాం. వారు కొత్తగా నిర్మించిన నాలాకు భూమిని ఉచితంగా ఇచ్చిన విషయం, వారికి జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే న్యాయం జరుగుతుంది.
>
> \- మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌

## భూ సమస్యలపై డిప్యూటీ సీఎంకు విన్నపం



ఉప ముఖ్యమంత్రి బట్టికు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని ఘాంసిమియాగూడలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు స్థానికులు గురువారం వినతిపత్రం అందజేశారు. నందిగామ మండల పరిధిలో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 4లో ఉన్న సీలింగ్‌ భూముల్లో రైతులు తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులకు ఎలాంటి రాయితీ, రుణ సౌకర్యాలు దొరకడంలేదన్నారు. గతంలో రైతుల పేరటి ఈ భూములకు పాసు పుస్తకాలు జారీ అయినట్లు తెలిపారు. ఇటీవల రెవెన్యూ అధికారులు కొంత మంది రైతుల పేర్లను కూడా తొలగించినట్లు చెప్పారు. ఆడపిల్లల పెళ్లిళ్లు, ఇతర అత్యవసరాలకు భూములను అమ్ముకోవాలంటే సాధ్యం కావడంలేదన్నారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు మహేందర్‌, రైతులు ఉన్నారు.

## 2న స్పాట్‌ కౌన్సిలింగ్‌

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్‌ అగ్రికల్చర్‌, బీటెక్‌ ఫుడ్‌ టెక్నాలజీ కోర్సుల్లో కన్వీనర్‌ కోట కింద మిగిలిన సీట్ల భర్తీకై సెప్టెంబర్‌ 2న స్పాట్‌ కౌన్సిలింగ్‌ నిర్వహించడం జరుగుతుందని రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు ఎంపీసీ స్ట్రీమ్‌ కింద తెలంగాణ ఎంసెట్‌ 2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్‌ తత్సమాన కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా హాజరు కావచ్చని, స్పాట్‌ కౌన్సిలింగ్‌ విధివిధానాలు అర్హత ప్రమాణాలు సీట్ల వివరాలు, ఇతర సమాచారం కొరకు అభ్యర్థులు విశ్వవిద్యాలయం వెబ్‌ సైట్‌ చూడాలని తెలిపారు.

## ఘనంగా క్రీడా దినోత్సవం



బండ్లగూడ: బండ్లగూడ జాగీరులోని ఎంపీపీఎస్‌, పీఅండ్‌టి కాలనీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్‌ అల్లావల్లి మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక వికాసం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెజిస్టిక్‌ ఈవెంట్‌ పోస్టర్‌ ఆవిష్కరణ

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సెప్టెంబర్‌ 13,14 తేదీలలో మొక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సాంకేతిక సింపోసియం మెజిస్టిక్‌ ఈవెంట్‌ పోస్టర్‌ను గురువారం కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ 15న విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవాన్ని ఇంజనీర్స్‌ డే జరుపుకుంటారన్నారు. అందులో భాగంగానే తమ కళాశాలలో మెజిస్టిక్‌ సింపోజియం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న పలు ఇంజనీరింగ్‌ కళాశాల విద్యార్థులు పేపర్‌, పోస్టర్‌ ప్రెజెంటేషన్‌, సర్క్యూట్‌ సవరణ, రోబోటిక్స్‌, 3డి ప్రింటింగ్‌, ఎక్స్‌పర్ట్‌ లెక్చర్స్‌, ప్రాజెక్ట్‌ ఎక్స్‌పో, ఐడియా ప్రెజెంటేషన్‌, టెకీ క్విజ్‌ లాంటి అనేక ఈవెంట్‌లలో పాల్గొంటారన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమం కళాశాలకు ప్రత్యేకతగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, సింపోజియం కన్వీనర్‌, ఇతర నిర్వాహకులు పాల్గొన్నారు.

## మారుతి ఎన్‌క్లేవ్‌లో పందుల స్వైర విహారం



కాలనీలో సంచరిస్తున్న పందులు

- అనారోగ్యాలకు గురౌతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని ఉప్పర్‌పల్లి మారుతి ఎన్‌క్లేవ్‌ కాలనీలో పందుల స్వైర విహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. అసలే వానాకాలం కావడంతో పాటు ఆపై సీజన్‌ వ్యాధులు తోడు పందుల సంచారంతో దుర్వాసన, దోమల బెడదతో డెంగీ వ్యాధితో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల వల్ల జరుగుతున్న అనారోగ్యంపై జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగానికి ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కాలనీ నుంచి పందులను నివారించాలని కోరుతున్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న కాలనీలు, రోడ్లకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ పద్మవీరారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీపై అవగాహన కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌



మాట్లాడుతున్న కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ మేజిస్ట్రేట్‌ ఆదేశాల మేరకు గురువారం హిమాయత్‌సాగర్‌లోని కార్యాలయంలోని కౌన్సిల్‌ హాల్‌లో మున్సిపల్‌, హెల్త్‌ శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌, అధ్యక్షతన డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విష జ్వరాలపై అప్రమత్తంగా ఉంటూ రోగాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్‌ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో ఫాగింగ్‌ చేయిస్తున్నామని, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌ బాల్స్‌ వదులుతున్నామని, లార్వి సైడ్‌ స్ప్రే, ఐఈసీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌ కలెక్టర్లు, మెడికల్‌ ఆఫీసర్‌, శానిటేషన్‌ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలలో డెంగీపై అవగాహన**

బండ్లగూడ: డెంగీ జ్వరంపై దర్గా ఖలీజ్‌ఖాన్‌లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఈసీ కార్యక్రమంలో భాగంగా వారికి ఫ్లయ్యర్స్‌ను అందించి అందులో ఉన్న విధంగా పాటిస్తూ సీజనల్‌ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు దోమల పెరుగుదలను అరికట్టడానికి అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్‌ ఆఫీసర్‌ సుజాత, ఉపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, బిల్‌ కలెక్టర్‌ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంజీఐటీలో క్రీడా దినోత్సవం

మణికొండ: మేజర్‌ ధ్యానచంద్‌ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు టెబుల్‌ టెన్నిస్‌ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్‌ డైరెక్టర్‌ బర్నాబాస్‌, సహాయ ప్రొఫెసర్‌ శంకర్‌ కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## నూతన స్తంభం ఏర్పాటు చేయండి

అత్తాపూర్‌: హైదర్‌గూడ జనప్రియ చౌరస్తా నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎలక్ట్రికల్‌ స్తంభం అడ్డంగా వంగిపోయింది. గత రెండు రోజులుగా ఆ రహదారి గుండా వెళ్తున్న స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురౌతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంగిపోయిన స్తంభాన్ని తొలగించి దానిస్థానంలో మరో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

- నిమజ్జనం చేయనున్న చెరువుల పరిశీలన
- చెరువులో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు
- ఉత్సవాలను, నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



చెరువును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు

అత్తాపూర్‌: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనం చేయనున్న చెరువులను గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు, రాజేంద్రనగర్‌ డీసీపీ, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పత్తికుంట పల్లె చెరువు శివరాంపల్లి, రాజేంద్రనగర్‌ అంతలో ఉన్న చెరువులను పరిశీలించారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్కను జేసీబీల సహాయంతో తొలగిస్తున్నారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం ఏర్పాట్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునే విధంగా నిర్వాహకులు, స్థానిక నాయకుల అభిప్రాయాన్ని అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ కమిషనర్‌ వెంకన్న, రాజేంద్రనగర్‌ డీసీపీ రవికుమార్‌, ఎగ్జిక్యూటీవ్‌ ఇంజనీర్‌ నరేందర్‌గౌడ్‌, ఏసీపీ శ్రీనివాస్‌, అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరామిరెడ్డి, స్థానిక నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్‌ కుమార్‌, రామేశ్వరరావు, సత్యనారాయణ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

**గణేష్‌ ఉత్సవాల సందర్భంగా చెరువుల పరిశీలన**

రాజేంద్రనగర్‌: గణేష్‌ ఉత్సవాల నేపథ్యంలో రాజేంద్రనగర్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం సర్కిల్‌ పరిధిలోని పత్తికుంట, పల్లె చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా చెరువుల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, వసతులపై చర్చించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌ ఆంక్షలు, పోలీసుల బందోబస్తు తదితర వాటిని పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో గణేష్‌ ఉత్సవ సమితి సభ్యులు అధికారులకు పలు సమస్యలను వివరించగా, ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్‌, రాజేంద్రనగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ రవి కుమార్‌, ఈఈలు, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎం అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## చదువులతో పాటు స్కిల్స్‌ నేర్చుకోవాలి



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి కృష్ణవేణి



కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్‌ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినిలు, తల్లిదండ్రులకు గురువారం ఓరియంటేషన్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీసీఎస్‌ సైబర్‌ సెక్యూరిటీ ప్రాక్టీస్‌ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌, సర్వీసెస్‌ హెడ్‌ కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలలో ఉన్న సబ్జెక్టులతో పాటు కమ్యూనికేషన్‌, సాఫ్ట్‌వేర్‌ స్కిల్స్‌ నేర్చుకుంటే జీవితంలో రాణించే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. మైక్రోన్‌ లిమిటెడ్‌ డేటా సైన్స్‌ ఇంజనీర్‌ నాగరమ్య మాట్లాడుతూ.. అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, కంప్యూటర్‌, ఐటీ రంగాలలో కూడా మహిళలు తమ సత్తాచాటుతున్నారన్నారు. చదువులతో పాటు వ్యక్తిత్వం, మానసిక పరిపక్వతను పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎ.నర్మద మాట్లాడుతూ.. కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని పోటీతత్వంలో నెగ్గి రాణించేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్‌ ఆఫ్‌ ఎవాల్యుయేషన్‌ డాక్టర్‌ కృష్ణారెడ్డి, ప్లేస్‌మెంట్‌ ట్రైనింగ్‌ హెడ్‌ హర్షవర్ధన్‌లతో పాటు అధ్యాపకులు, 2వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఒత్తిడి మాయం



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రీడలు మానసిక ధైర్యంతో పాటు ఒత్తిడిని అధికమిస్తాయని, విద్యార్థులు ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడలో పాల్గొన్నాలని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ డైరెక్టర్‌ జనరల్‌ సాగర్‌ హనుమాన్‌ సింగ్‌ అన్నారు. గత మూడు రోజులు క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

## ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



పిల్లలతో కలిసి అదృశ్యమైన మంగమ్మ

శంషాబాద్‌ రూరల్‌: డబ్బుల విషయంలో భర్తతో గొడవ పడిన మహిళ, తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన మంగళారమ్‌ శేఖర్‌, మంగమ్మ దంపతులకు కొడకు, కూతురు ఉన్నారు. మంగమ్మ తన భర్త సోదరుడు జేబులో నుంచి రూ.500 తీసుకుంది. ఈ విషయంలో భార్య, భర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 28న ఆటో డ్రైవింగ్‌ చేయడానికి బయటకు వెళ్లిన భర్తకు మంగమ్మ ఫోన్‌ చేసి ఇంటికి రమ్మంది. కోపంలో ఉన్న భర్త తాను రాలేనంటూ ఫోన్‌ను కట్‌ చేశాడు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా.. భార్య మంగమ్మ(20), కూతురు ఉషా(4), కొడుకు జగదీష్‌(1) ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా మంగమ్మ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చిందని భర్త తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వృద్ధుడి అదృశ్యం

అత్తాపూర్‌: ఓ వృద్ధుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన అత్తాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. కానిస్టేబుల్‌ నీలిమ తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌దీప్‌సింగ్‌ (60)తన కుమార్తె సీతల్‌ ఇంటిలో ఉంటున్నాడు. ఆగస్టు 20న సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమార్తె పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్‌ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పడుకున్న చోటే వ్యక్తి మృతి

శంషాబాద్‌: ఇంట్లో పడుకున్న చోటే వ్యక్తి మృతిచెందిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇంద్రారెడ్డి కాలనీలో నివాసముంటున్న నాగర్‌ కర్నూల్‌ జిల్లాకు చెందిన మైసయ్య భార్య, పిల్లలు ఇటీవల రాఖీ పండగకు సొంతూరుకెళ్లారు. రెండురోజులుగా ఇంటి తలుపులు తెరిచి లేకపోవడంతో యజమానులు ఇంట్లోకి వెళ్లి చూడగా పడుకున్న చోటే మైసయ్య (44) మృతిచెంది ఉండడంతో గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### GENERAL NOTICE

Under the instructions of my client, Mohammed Basheeruddin S/o late Mohammed Viqaruddin, Aged 78 yrs, Occ: nil, R/o H.No. 2-62, Hameedullah Nagar, Shamshabad Mandal, Ranga Reddy Dist, Telangana State.

The General public is hereby informed that my client has PRONOUNCED "AAQ" on 1st AUGUST 2024 in the presence of witness against his son Mohammed Zaheeruddin disowning him for his continuous dis -obedience and acts against the interest of the family. Hence from the date of "AAQ" Mohammed Zaheeruddin, has no matter of right in respect of the property of my client. Hence this NOTICE.

**Sd/- P.SIDDESHWAR GOUD**
B.A. L.L.B, Advocate
Office: 20-53/A, Unit Complex, Opp: MRO Road, Shamshabad, R.R. Dist.-501218
Cell: 9966619700, 9866333350

### IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGAREDDY DISTRICT AT SHADNAGAR

**O.S.No. 198 of 2003**

**Between :** Kuntla Kumar, S/o. Late K. Narsaiah, Aged about 44 Years, Occ : Labour, R/o. H.No. 2-24/3, Satamrai Village, Gaganpahad, Shamshabad Mandal, R.R. District. ...Plaintiff

AND

1. Kuntla Krishna, S/o. Late Kuntla Narsaiah, Aged about 45 Years, Occ : Service, R/o. H.No.2-24/3, Satamrai Village, Gaganpahad, Shamshabad Mandal, R.R. District.

3. B. Muralikrishna Reddy, S/o. Madhava Reddy, Aged about 56 Years, Occ : Business, R/o. 8-4-17/188, Sairam Nagar Colony, Karmanghat, Ranga Reddy District. ... Respondents No 1 and 3

**NOTICE**

Please take notice that the Plaintiff has filed suit vide O.S.No. 198 of 2023, pending before the Junior Civil Judge, Shadnagar, seeking Partition of land admeasuring Ac. 3.38 gts., in Sy.No. 367/A, situated at Nerralla Cheruvu, Burgala Shivar, Farooq Nagar Mandal, Shadnagar, Ranga Reddy District claiming his half (1/2) share. The Hon'ble Court has adjourned this matter for hearing on 29-10-2024 at 10:30 am for your appearance. In the event of your failure to appear before the Hon'ble Court on the said date, the matter will be decided based on the material available on record in your absence. Hence the Notice.

**(By Order of the Court)**

**Sd/- P.Ganesh, D.Srinivas,** Advocates, # H.No. 3-50, Chinnagolkonda Village, Shamshabad Mandal, Rangareddy District.